క్లుప్తంగా

బెజ్జూర్ సహకార సంఘం సీఈవో సస్పెన్షన్

బెజ్జూర్: బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఈవోగా విధులు నిర్వహిస్తున్న జక్కుల సత్యనారాయణగౌడ్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల బెజ్జూర్ ఏవో నాగరాజ్, పెంచికల్‌పేట్ ఏవో మనీషాతోపాటు కొంతమంది రైతులపై దురుసుగా ప్రవర్తించడం, ఇష్టానుసారంగా మాట్లాడడంపై వారిచ్చిన ఫిర్యాదుతో చర్యలు తీసుకున్నట్లు ఇన్‌చార్జి డీసీఓ బిక్కు నాయక్ తెలిపారు.

ఇప్పటివరకు ముగ్గురు..

గత కొంత కాలంగా సహకార సంఘం కార్యాలయంలో సీఈవోలుగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్‌గౌడ్, సంజీవ్ రైతులకు సంబంధించిన డేటా ఆన్‌లైన్‌లో పొందుపర్చకపోవడంతోపాటు డబ్బులు స్వాహా చేశారని ఇద్దరిని సస్పెన్షన్ చేశారు. తాజాగా సత్యనారాయణగౌడ్ సస్పెన్షన్‌తో వీరి సంఖ్య ముగ్గురికి చేరింది.

టై, బెల్టుల పంపిణీ



టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ గురువారం టై, బెల్టు, మధ్యాహ్న భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం రమేశ్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పాఠశాల పేరుతో కూడిన టై, బెల్టులు అందించడం హర్షణీయమన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు రామచంద్రం, ప్రియదర్శిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్తులు అటవీ అధికారులు గురువారం డాగ్ స్క్వాడ్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టాలు, శిక్షల గురించి తెలియజేశారు. అటవీ నేరాలకు పాల్పడితే డాగ్ స్క్వాడ్ ద్వారా పట్టుబడతారన్నారు. అంతకుముందు రేంజ్ కార్యాలయంలో అటవీ అధికారులు, సిబ్బందికి, ఎనిమల్ ట్రాకర్స్‌కి డాగ్ స్క్వాడ్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార లోపం లేని సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న బాలరాజు రాజారామ్

ఆసిఫాబాద్‌అర్బన్: పోషకాహార లోపం లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని ఆస్పిరేషన్ బ్లాక్ అధికారి డాక్టర్ బాలరాజు రాజారామ్ పేర్కొన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లి గార్డెన్‌లో గురువారం అంగన్‌వాడీ మూడురోజుల శిక్షణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే పిల్లల పౌష్టికాహారంపై దృష్టిపెట్టాలన్నారు. పోషకాహార లోపం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖగుర్తింపు హాజరు విధానం, పూర్వ ప్రాథమిక విద్యను పక్కాగా అమలు చేయాలన్నారు. వచ్చే నెల 16వ తేదీ వరకు నిర్వహించే పోషణమాసం అమలు దిశగా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. సీడీపీవో తిరుపతమ్మ, సిబ్బంది స్వప్న, పెంటుబాయి. లైలా తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



శ్రమదానం చేస్తున్న యువసైన్యం సభ్యులు

తిర్యాణి: మండల కేంద్రం నుంచి త్రీ–ఇంక్లిన్ వరకు ఉన్న బీటీ రోడ్డు గుంతల మయంగా మారడంతో గురువారం అనిల్ అన్న యువసైన్యం ఆధ్వర్యంలో శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు. జిల్లా నాయకుడు అనిల్ గౌడ్, నాయకులు చిత్తారి సాగర్, పెరుమాండ్ల వెంకటేశ్‌గౌడ్, బొల్లం శంకర్, బుద్దె విజయ్, ఆత్రం వినోద్, మెడిశెట్టి శంకర్, అమర్ తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యమే.. వృక్షమైంది!



కౌటాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనం గోడ నుంచి మొలిచిన ఓ మొక్క రోజురోజుకు పెరిగి వృక్షంగా మారుతోంది. ఇప్పటికే ఆ భవనం గోడలకు పగుళ్లు రాగా.. పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనం ఏ క్షణానైనా కూలిపోయే ప్రమాదం ఉంది. దీని పక్కనే వ్యాపారులు చేపలు విక్రయిస్తుండడంతో ప్రజలు వస్తుంటారు. పలువురు బైక్‌లతోపాటు ఆటోలను భవనం వద్ద పార్కింగ్ చేస్తున్నారు. అది శిథిలావస్థకు చేరి వినియోగంలో లేకపోవడంతో ఎప్పుడైన ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అసలు అధికారులు నిర్లక్ష్యం చేయకుండా మొదటగా మొక్కను తొలగించి ఉంటే అది వృక్షంగా మారేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెట్టుతోపాటు భవనం తొలగించాలని మండలవాసులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులేవి?



బీబ్రా వద్ద దెబ్బతిన్న రోడ్డు



గుంత వద్ద చెట్టుకొమ్మలే సూచిక బోర్డు

దహెగాం: దహెగాం నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. నాలుగేళ్ల క్రితం భారీ వరదల వల్ల పెద్ద వాగు ఉప్పొంగడంతో మండలంలోని బీబ్రా, పెసరికుంట గ్రామాల వద్ద ప్రధాన రహదారిపై నీరు చేరి కోతకు గురైంది. అప్పటి నుంచి గుంతలు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా బీబ్రా, ఐనం గ్రామాల మధ్య రోడ్డుపై బుంగ ఏర్పడింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలే బుంగ వద్ద చెట్టుకొమ్మలు ఏర్పాటు చేశారు. అవే సూచిక బోర్డులుగా మారిందని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిండుకుండలా..



అమ్మన్నమడుగు ప్రాజెక్టులో నీరు

- చెరువులు, వాగులు, ఒర్రెలకు జలకళ
- కురుస్తున్న వర్షాలకు గలగల
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కెరమెరి: మండలంలోని గ్రామాల్లోని చెరువులు, వాగులు, ఒర్రెలు నిండుకుండలా మారాయి. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు జలకళ సంతరించుకున్నాయి. తుమ్మగూడ, ధనోరా, గోయగాం, అంబారావు, మెట్టపిప్రి, సాంగ్వి గ్రామాల సమీపంలో వాగులు, నదులు నీటితో గలగల పారుతోంది. చాలాఏళ్ల తర్వాత ఇలా పారడం చూస్తున్నామని గ్రామాల ప్రజలు అంటున్నారు. పొలాలు నీటితడిగా ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వానాకాలం ప్రారంభంలో కురవాల్సిన వర్షాలు ఇలా కురవడంతో మంచి కాలమే వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వానలు పడుతుండడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతుందని పేర్కొంటున్నారు.

ప్రాజెక్టులో చేరిన నీళ్లు!

మండలంలోని కెస్లాగూడ సమీపంలో అమ్మన్నమడుగు ప్రాజెక్టులో నీరు గణనీయంగా చేరింది. నెల క్రితం వరకు ఎంతో తక్కువగా ఉన్న ప్రస్తుతం మత్తడిపై నుంచి ప్రవహిస్తోంది. చాలాకాలం తర్వాత ఇలా నీరు చేరిందని ప్రజలు అంటున్నారు. ఈసారి మరింత వానలు కురిస్తే కాలువలు ఉండే రైతులు ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని సరఫరా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వానలతో పత్తి పంటలకు చేటు తప్పదని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భజలం పెరిగే అవకాశం



కురుస్తున్న వర్షాలతో వాగులు, చెరువులు నిండుకుండలా మారాయి. దీంతో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పుడు వానలు తక్కువైన నది పరీవాహక ప్రాంతాల్లో పంటలకు ఢోకా లేకుండా ఉంటుంది.

– యుగేందర్, ఎంపీవో, కెరమెరి

రైల్వేఫోరం ఆధ్వర్యంలో ఎంపీకి వినతి



ఎంపీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రైల్వే ఫోరం ఆధ్వర్యంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులకు గురువారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలు హాల్టింగ్‌కు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలు వారి దృష్టికి తీసుకెళ్లారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి తిరుపతి వరకు నూతన రైలు, బల్లార్షా–కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైలు చర్లపల్లి వరకు పొడగించాలని, కాగజ్‌నగర్ ప్రాంతంలో బెంగాలీ ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి హౌరా వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్ మీదుగా రైలు నడపాలని కోరారు. సభ్యులు ఠాకూర్ రవీస్ సింగ్, పూదరి రవితేజ ఉన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: దివంగత మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తం రావు స్మారక కబడ్డీ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిశాయి. కాగజ్‌నగర్ సెవెన్‌స్టార్స్ వర్సెస్ సిర్పూర్ బజరంగ్‌దళ్ మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో సెవెన్‌స్టార్స్ విజయం సాధించింది. విజేతలకు ఎంపీ నాగేశ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బహుమతులు అందజేశారు. విజేతకు రూ.50వేలు, సిర్పూర్ బజరంగ్‌దళ్ టీంకు రెండో బహుమతి రూ.25 వేలు, బెజ్జూరు మండల అర్కగూడ జట్టుకు మూడో బహుమతి రూ.15 వేలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకం ద్వారా నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బీజేపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రాణి చిన్నదే.. హాని పెద్దది!

- దోమకాటుతో అంటువ్యాధులు
- వర్షాలతో వీటి బెడద ఎక్కువ
- జాగ్రత్తలు పాటించడంతో నివారణ



అనార్‌పల్లి హాస్టల్‌లో పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది

కెరమెరి: రెండక్షరాల చిన్నప్రాణి దోమ. అయితే మనిషికి చేసే ముప్పు మాత్రం చాలా పెద్దది. మండలంలోని వివిధ గ్రామాల్లో గత రెండు నెలలుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈనేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత ఉంచుకోవడం చాలా అవసరం. కాని కొన్నిగ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. వర్షాకాలంలో అన్ని అంటువ్యాధులు ఒకరి నుంచి మరొకరికి చేరవేస్తూ ఆస్పత్రుల పాల్జేస్తోంది. జాగ్రత్తలతో దోమకాటుతో గురికాకుండా చూసుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. నీటి నిల్వ ప్రాంతాల్లో దోమలు గుడ్లు పెట్టి సంతానాన్ని వృద్ధి చేస్తాయి. ఈ గుడ్లు వాతావరణంలోని వేడితో మూడు రోజుల్లో లార్వాగా బయటికి వచ్చి ప్యూపాగా(లార్వా తన సొంత రూపాన్ని విడిచిపెట్టి కొత్త రూపం ధరించడం) మారుతాయి. అనంతరం దోమలుగా మార్పు చెందుతాయి. చాలా అంటు వ్యాధులు దోమతోనే వ్యాపిస్తాయి. దోమకాటుకు డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, బోదకాలు తదితర వ్యాధులు వస్తాయి. ఈ వ్యాధులు ఉన్న వారిని దోమలు కాటేసినా అనంతరం ఇతరులకు కుడితే ఆరోగ్యవంతులకు వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధుల లక్షణాలు దాదాపు ఒకే రకంగా ఉంటాయి. అయితే ఇటీవల వైద్యసిబ్బంది వసతిగృహాల్లో దోమల నివారణకు పిచికారీ చేస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



దోమలు కుడితే వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లి. వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి పాటించాలి. ఇంటి సమీపంలో ఎక్కడా నీటి నిల్వ ఉంచద్దు, గుంతలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. ఎవరై న అస్వస్థతకు గురైతే ఆస్పత్రిలో చికిత్స పొందాలి.

– వినోద్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి

పెన్షన్లు పెంచాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

కౌటాల: రాష్ట్రప్రభుత్వం పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వృద్ధులు, దివ్యాంగులు మండలకేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో గురువారం కౌటాల–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నక్క పెద్ద శంకర్ మాట్లాడుతూ ఎన్నికల హామీ ఇచ్చిన ప్రకారం ప్రభుత్వం పెన్షన్లు పెంచాలన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇవ్వాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు విఠల్, గణపతి, దుర్గ, బి.మెండి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కాగజ్‌నగర్‌టౌన్: తమకు మూడు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్‌కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. గురువారం నాలుగవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇరిగిరాల శంకర్ మాట్లాడారు. మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, దసరా పండగ వస్తుండడంతో వేతనాలు లేక కుటుంబాలు పోషించుకోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు. కార్మికులకు రావాల్సిన మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, కార్మికులు పాల్గొన్నారు.

యూరియా అందించాలని ఆందోళన



వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

కౌటాల: రాష్ట్రప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించాలని మండలంలోని రైతులు, నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా యూరియా కొరతతో పంటల సాగుకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. యూరియా బస్తాల కోసం రోజుల తరబడి వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. పత్తి, వరికి యూరియా వేయకపోవడంతో పంట ఎదుగుదల లోపించి దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు. యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా పంపిణీపై అలసత్వం వహిస్తున్నాయన్నారు. తుమ్మిడిహెట్టి రోడ్డును బాగు చేసి ఆర్టీసీ బస్సు సేవలు కొనసాగించాలని కోరారు. అంతకుముందు మొగడ్‌దగడ్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. సహకార సంఘం చైర్మన్ మాంతయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శైలేజాగౌడ్, రేణుక, వసంత్‌రావు, నక్క శంకర్, మధుకర్, భీమయ్య, శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, తిరుపతి, బాపు, లహంచు తదితరులు పాల్గొన్నారు.

కొరత లేకుండా చూడాలి

దహెగాం: రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు నాయకులు గురువారం డీటీ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పొట్ట, పత్తి పూత, కాత దశలో ఉన్నందున యూరియా అవసరం ఉందన్నారు. లేకపోతే పంటల ఎదుగుదల లేక దిగుబడిపై ప్రభావం ఉంటుందన్నారు. రైతులకు సరిపడా యూరియా అందేలా చూడాలని లేకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. నాయకులు సంతోష్‌గౌడ్, ఎస్‌కె హైమద్, చౌదరి సురేష్, ప్రసాద్‌రాజు, బండ క్రిష్ణ, సంతోష్, రైతులు ఉన్నారు.

సంక్షేమ నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కెరమెరి: జీవో నంబర్ 12ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారా సహజ, ప్రమాద, మరణం, పాక్షిక పూర్తిస్థాయి అంగవైకల్యానికి ఇచ్చే సంక్షేమ నిధులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఫాల్కర్ రాంచందర్, మండల కోకన్వీనర్ అనిల్‌కుమార్ కోరారు. మండలకేంద్రంలోని గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 55 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.9 వేల పెన్షన్ స్కీం అమలు చేయాలని, సహజ మరణానికి రూ.1.30 లక్షలు పెంచాలన్నారు. ప్రైవేటు కంపెనీలకు బదిలీ చేసిన రూ.346 కోట్లను వెంటనే వాపసు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, విజయ్, ఆనంద్, ఎంకన్న, మహేశ్, సదయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

‘సిగ్గు సిగ్గు పాలకులారా’..



కౌటాలలో వెలసిన ఫ్లెక్సీలు

కౌటాల: మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా, మొగడ్‌దగడ్ చౌరస్తాలో గురువారం ‘సిగ్గు సిగ్గు పాలకులారా’అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. ధనవంతులకు రైలు సౌకర్యం కల్పించడం కాదని, పేదలకు బస్సు సౌకర్యం కల్పించండని ఫ్లెక్సీలో ఉంది. గత పదేళ్లుగా తుమ్మిడిహెట్టి గ్రామం వరకు బస్సు ఎప్పుడైన బంద్ అయిందా? కౌటాల నుంచి తుమ్మిడిహెట్టి వరకు రోడ్డు మరమ్మతు చేసి బస్సు నడిచేలా చూడండి పాలకులారా అంటూ ఫ్లెక్సీల్లో ఉంది. గురువారం ఈ బ్యానర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలి

కైలాస్‌నగర్: భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు నళిని రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. పదివేల ఎకరాలకుపైగా పత్తి, సోయా, ఇతర పంటలు నష్టం జరిగిందన్నారు. అధికారులు వందలా ఎకరాలను సర్వే చేయాల్సి ఉందన్నారు. రైతులకు పత్తికి రూ.15వేలు, సోయాబీన్ క్వింటాల్‌కు రూ.10వేల గిట్టుబాటు ధర చెల్లించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో అరుణ్ కుమార్, రాములు, గజారాం, స్వామి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

లింగాపూర్: స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యులు

బెజ్జూర్: పీహెచ్‌సీలో డాక్టర్ శ్రావణ్, డాక్టర్ మన్విత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన డాక్టర్ అవినాష్ జిల్లా వైద్యశాలకు పదోన్నతిపై వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన వైద్యులు మాట్లాడుతూ మారుమూల ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందిస్తామని తెలిపారు.

పీహెచ్‌సీలో వెక్కిరిస్తున్న ఖాళీలు

- ఇద్దరు వైద్యులకు ఒక్కరే..
- ఉన్న వైద్యాధికారి ఇన్‌చార్జిగా..
- మూడు స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీ
- రోగులకు అందని వైద్యసేవలు



దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దహెగాం: గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. అందులో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బందిని భర్తీ చేయకపోవడంతో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. ఉన్న వైద్యాధికారి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. దీంతో ప్రజలు, రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ వైద్యాధికారి లేక గ్రామీణప్రాంత ప్రజలు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా నలుగురు స్టాఫ్‌నర్సులకు గాను ఒక్కరే ఉన్నారు. మిగతా మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉండడంతో ప్రజలు, రోగులు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. మండలంలో ఏడు సబ్‌సెంటర్లు ఉండగా, ఇందులో మొదటి ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైద్యసిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.